# తండ్రి గారి సందేశం....



## ప్రభువునకు మనమేమి చెల్లింతుము?

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

ప్రభువు మనకు చేసిన ఉపకారములన్నిటికి తిరిగి మనం ప్రభువునకు ఏమి చెల్లించగలము? ప్రభువు మనకు అనుగ్రహించిన మేలులను లెక్కపెట్టడం ఎవరితరము కాదు. ప్రభువు మనకు అన్నిటిని దానముగా ఇచ్చాడు. "క్రీస్తు యేసు నందలి తన మహిమైశ్వర్యముల కనుగుణముగా నా దేవుడు మీ అవసరములన్నటిని తీర్చును." (ఫిలిప్పీ 4,19-20). "క్రీస్తు నందు దేవుడు, మనలను ఆశీర్వదించి, మనకు దివ్యలోకపు ప్రతి ఆధ్యాత్మికమైన ఆశీస్సులను ఒసగుచున్నాడు!" (ఎఫెసీ 1,3). సమస్తము దేవుని దానము. ''ఇతరుల కంటె నిన్ను అధికునిగ పరిగణించునదెవరు? దేవుని నుంచి పొందనిది నీవద్ద ఏమైన ఉన్నదా? మరి ఈ విధముగా పొందినదైతే నీకు ఉన్నది దేవుడు ఇచ్చిన దానము కాదని నీవు ఎట్లు గర్వింపగలవు?'' (1కొరింతీ 4,7). ఈ వాక్యములన్ని దేవుడు మనకు అవసరమైన సమస్తాన్ని ఇస్తున్నారని తెలియజేస్తున్నాయి. అలాగైతే మనం దేవునికి ఏమి ఇవ్వగలము?

**మన ప్రేమ**

మన ప్రేమను ప్రభువునకు మనం సమర్పించాలి. "ప్రభువు నా మొర వినును కనుక నేను ఆయనను ప్రేమింతును. ఆయన నా విన్నపమును ఆలకించును" (కీర్తనలు 116,1). క్రొత్త నిబంధన దీనిని ఇలా తెలియజేస్తుంది. "దేవుడు మనలను మొదట ప్రేమించుట చేతనే మనమును ప్రేమింతుము" (1 యోహాను 4,19). మనం దేవుని నిజంగా ప్రేమించినట్లయితే, ఆయనను ఆనందింపజేయడానికి ఏదైనా చేస్తాం, ప్రతిదీ చేస్తాం.

**మన కృతజ్ఞతాస్తుతి**

దేవునికి మనము కృతజ్ఞతా స్తుతలు చెల్లింప బద్ధులమై యున్నాము. "ప్రభువు నాకు చేసిన ఉపకారములకు గాను ఆయనకు ఏమి అర్పింపగలను?" (కీర్తన 116,12) అని ప్రశ్నించే కీర్తనకారుడు తనే ఇలా బదులిస్తున్నాడు. "నేను నీకు కృతజ్ఞతాబలిని అర్పింతును. నీ నామమునకు వందనములు చెల్లింతును" (కీర్తన 116,17). "మన ప్రభువగు యేసు క్రీస్తు ద్వారా ప్రతి విషయమును గూర్చి తండ్రి దేవునకు సర్వదా కృతజ్ఞతలను అర్పించుకొనుడు'' (ఎఫెసీ 5,20) అని క్రొత్త నిబంధనలో పౌలు గారు అంటున్నారు.

**మన సమయం**

దేవునికి మన సమయాన్ని సమర్పించాలి. "కనుక, మీరు ఎట్లు జీవించుచున్నారు అను దానిని గూర్చి శ్రద్ధ వహింపుడు. జ్ఞానహీనులవలె జీవింపకుడు. వివేకవంతులవలె జీవింపుడు. ఇవి చెడు దినములు కనుక దొరికిన ప్రతి అవకాశమును సద్వినియోగము చేసికొనుడు" (ఎఫెసీ 5,15-16). అని పునీత పౌలు గారు అన్నారు.

"నా జీవితం ఎంత విరామం లేకుండా ఉందో నీకు తెలియదు. ప్రభువునకు సమయం కేటాయించే సమయం నాకు లేదు" అని ఒకరు అనవచ్చు. కాని, "రోజుకు ఒక గంట ఎక్కువగా నీవు పడక మీద ఉండాలి, లేకుంటే చస్తావు అని డాక్టరు చెప్పాడనుకుందాం. చదవడం ద్వారా నీ కండ్లకు రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయించాలి, లేకపోతే నీవు గుడ్డివాడవైపోతావు అని డాక్టర్ అన్నాడనుకుందాం. నీ బిడ్డకు రోజుకు ఒక గంటసేపు నీవు తన చదువులో సహాయం చేయకపోతే అతడు తప్పుతాడు అని ఉపాధ్యాయుడు నీకు చెప్పాడనుకుందాం. అలాగైతే సమయాన్ని ఎలాగో అనుకూలం చేసికోవా? అప్పుడు నీకు సమయం కన్పిస్తుందా?" కాబట్టి ప్రభువు కొరకు సమయాన్ని అనుకూలం చేసికొందాం, మన సమయాన్ని ప్రభువుకు సమర్పిద్దాం.

**మన సామర్థ్యాలు**

ఆయన మనకు ప్రసాదించిన సామర్థ్యాలను దేవునికి సమర్పించుదాం. మనకందరికి దేవుడు ప్రసాదించిన తలాంతులు, నైపుణ్యాలు ఉన్నాయని, వాటిని ఆయన మహిమ కొరకు మనం వాడాలని మత్తయి 25,14-30లోని తలాంతుల ఉపమానం మనకు బోధిస్తుంది. ఆ ఉపమానంలో, ఒక తలాంతువాడు, తన తలాంతును పూడ్చి పెట్టాడు. స్వార్థము, నులివెచ్చనితనం, భక్తిహీనత, విముఖత, అలసత అనే సమాధులలో మన తలాంతులను పూడ్చి పెట్టకుండా మన సామర్థ్యాలను దేవాది దేవునికి మరియు సమాజం కొరకు వినియోగించుదాం.

**మన డబ్బు**

మన ఆస్తులను కూడా మనమాయనకు సమర్పింప బద్ధులమైయున్నాం. "వారు తమ స్థిర చరాస్తులను అమ్మి, అందరకును వారి వారి అవసరములను బట్టి పంచి పెట్టిరి" (అపోస్తులుల కార్యములు 2,45). మాసిడోనియాలోని క్రైస్తవులు, "నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను" (2 కొరింతీ 8,2). దేవుని పని విస్తరించడంలో, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో మన ఆస్తులను ఉపయోగించక పోయినట్లయితే, మన ప్రేమ లోతు లేనిదైయుంటుంది.

**మన సమస్తం**

మన ''సమస్తము'' ప్రభువునకు సమర్పించాలి. (మత్తయి 22,37). "ప్రభువునకు... నేనేమి అర్పింపగలను?" అని ప్రశ్న అడిగిన తరువాత, "నేను నా మ్రొక్కులు చెల్లించుకొందును"నని కీర్తన కారుడు అంటున్నాడు. (కీర్తన 116,14 మరియు18). మరో విధంగా చెప్పాలంటే, "నేను ప్రభువునకు వాగ్దానం చేసిన ప్రతిదాన్ని జరిగిస్తాను" అని అతడు అంటున్నాడు.

మనం మన జీవితాలను ప్రభువునకు సమర్పించుకుందాం. నిరంతరం ఆయన ఇష్టం నెరవేరుస్తామని వాస్తవంగా మనం మ్రొక్కుకుందాం. మన కొరకైన దేవుని ఉపకారములు అతి శ్రేష్ఠమైనవి కాబట్టి మనము మన శ్రేష్ఠమైనవి ఆయనకు, సంఘానికి, సమాజానికి సమర్పించుదాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు